
సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024

## బొడ్డెమ్మ బొడ్డెమ్మ ఉయ్యాలో..



సుల్తానాబాద్(పెద్దపల్లి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ మహావేడుకల్లో తొలిఘట్టం బొడ్డెమ్మ పండుగ మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మెత్తని మట్టితో తయారు చేసిన బొడ్డెమ్మ(గౌరీదేవి)ను పీటపై ఉంచిన ఆడబిడ్డలు.. పసుపు, కుంకుమ, రంగురంగుల పూలతో అలంకరించారు. చుట్టూ లయబద్ధంగా తిరుగుతూ ఆటలు ఆడారు. పాటలు పాడారు. అనంతరం వాయినాలు ఇచ్చుకున్నారు. ప్రాంతాల వారీగా ఈ వేడుకలు ఏడురోజుల పాటు జరుపుకోవడం ఆనవాయితీ.

# ‘పది’ సిలబస్.. చేరేనా టార్గెట్?




టీచర్ల బోధన.. విద్యార్థుల చదువు ముందు నుంచి ఒక ప్రణాళిక ప్రకారం సాగితేనే పదోతరగతిలో మంచి ఫలితాలు వస్తాయి. డిసెంబర్ 31 నాటికి పాఠ్యాంశాల బోధన పూర్తి చేసి, పునశ్చరణ తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 50 శాతం వరకు సిలబస్ పూర్తయిందని డీఈవోలు చెబుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో బడిబాట, టీచర్ల బదిలీలు, పదోన్నతులు, స్వచ్ఛతా హీ సేవ, పోషణ్ అభియాన్ వంటి కార్యక్రమాలు, ఎఫ్ఎల్ఎన్ శిక్షణతో కొంత ఇబ్బంది కలిగినా.. నష్టపోయిన సమయాన్ని పూడ్చేందుకు ప్రత్యేక దృష్టిసారించామని అంటున్నారు. అయితే, వరుస సెలవుల నేపథ్యంలో సిలబస్ పూర్తి చేయడం సాధ్యమేనా అన్న సందేహాలను విద్యార్థుల తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు.

- 50 శాతం పూర్తి..
- శతశాతానికి మిగిలింది 3 నెలలు
- అక్టోబర్ నెల సగం దసరా సెలవులే..
- లక్ష్యాన్ని చేరేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నామంటున్న డీఈవోలు
- ఉమ్మడి జిల్లాలో 1,931 పాఠశాలలు



కాల్వశ్రీరాంపూర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న అకాడమిక్ మానిటరింగ్ అధికారి

### పెద్దపల్లిలో కలెక్టర్ నజర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో జెడ్పీ 100,ఉన్నత పాఠశాలలు 04, ఆదర్శ 07, మైనారిటీ గురుకులాలు 04, ఎయిడెడ్ 05, కేజీబీవీలు 10, గురుకులాలు 10, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు 172 ఉన్నాయి. వీటిల్లో 19 వేల మందికి పైగా విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. ఆయా స్కూళ్లలో విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాల బోధన జరిగేలా విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. వచ్చే నెలలో సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ పదోతరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్నారు. టెన్త్ ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గతేడాది ఫలితాల్లో జిల్లా 92.4 శాతం సాధించి, రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచిందని, ఈసారి అంతకన్నా మెరుగైన ఫలితాలు రావాలని సూచించారు.

### సమ్మేటివ్ పరీక్షలకు సిద్ధం



ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాల బోధన సాగుతోంది. అక్టోబర్ 21 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాం. ఇప్పటివరకు ఉన్న లక్ష్యాల మేరకు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సిలబస్ పూర్తయింది.

– పీఎం షేక్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి



కథలాపూర్ స్కూల్లో ప్రత్యేక తరగతులు (ఫైల్)

### జగిత్యాల హ్యాట్రిక్ నుంచి 24వ స్థానం

జగిత్యాల: జగిత్యాల 2016–17, 2017–18, 2018–19 పదోతరగతి ఫలితాల్లో వరుసగా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచి, హ్యాట్రిక్ సాధించింది. గతేడాది 84.05శాతం ఉత్తీర్ణతతో 24వ స్థానానికి పడిపోయింది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 13, జిల్లా పరిషత్ 175, ఆదర్శ 13, కేజీబీవీలు 14, బీసీ వెల్ఫేర్ 06, మైనారిటీ 05, టీఎస్ రెసిడెన్షియల్ 02, సోషల్ వెల్ఫేర్ 5, ప్రైవేట్ పాఠశాలలు 104 మొత్తం 337 స్కూళ్లు ఉన్నాయి. 11,991 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 50 శాతం సిలబస్ పూర్తి చేశామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ.. పాఠశాలలను తనిఖీ చేస్తున్నారు. జనవరి 1 నుంచి ప్రత్యేక తరగతులు తీసుకోవాలన్నారు. టీచర్లు సీ–గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అయితే, సెలవుల నేపథ్యంలో సిలబస్ పూర్తవుతుందా అని తల్లిదండ్రులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

### వందశాతం ఫలితాలకు చర్యలు



పదోతరగతిలో వందశాతం రిజల్ట్స్‌కు చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. సిలబస్ డిసెంబర్ 31 వర కు పూర్తయ్యేలా చూస్తాం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. – జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

### కరీంనగర్‌లో ఇన్‌చార్జి ఎంఈవోలే..

కరీంనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి సిలబస్ అటూఇటుగా 50 శాతం పూర్తయినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మొత్తం 16 మండలాలు ఉంటే అన్నిచోట్లా ఇన్‌చార్జి ఎంఈవోలే ఉన్నారు. దీంతో టీచర్లపై పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలున్నాయి. షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేసి, వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మెరుగైన ఫలితాలు రావడానికి అస్కారం ఉంటుంది. అక్టోబర్ 2 నుంచి 14 వరకు దసరా సెలవులు, క్రిస్మస్‌కు నాలుగు రోజులతోపాటు సాధారణ సెలవులు ఉండనున్నాయి. మరి డిసెంబర్‌లోగా సిలబస్ పూర్తవుతుందో లేదో వేచిచూడాలి. వీలైనంత త్వరగా సిలబస్ పూర్తి చేసి, పునశ్చరణ తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించింది. గతేడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లా 95 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి, రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది.

**జిల్లాలోని పాఠశాలలు, విద్యార్థులు**

ప్రభుత్వ పాఠశాలలు 65, ఎంపీపీ/జెడ్పీ 598, కేజీబీవీ 14, ఆదర్శ 11, ప్రైవేట్ 323, ప్రైవేట్ ఎయిడెడ్ 12, ఎస్సీ గురుకులాలు 08, బీసీ గురుకులాలు 11, మైనార్టీ గురుకులాలు 09, స్పోర్ట్స్ స్కూల్ 01, అర్బన్ రెసిడెన్షియల్ 02 మొత్తం 1,060 పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో పదోతరగతి విద్యార్థులు మొత్తం 12,695 మంది ఉన్నారు.



ఇటీవల తిమ్మాపూర్‌లోని జ్యోతిబాపూలే పాఠశాలను తనిఖీ చేసి, భోజనం చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

### సెలవుల తర్వాత ప్రత్యేక తరగతులు



పదోతరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశాం. నిరంతర పర్యవేక్షణకు తనిఖీలు చేపడుతున్నాం. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి, ఫలితాల్లో కరీంనగర్‌ను ముందంజలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దసరా సెలవుల తర్వాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. – జనార్దన్‌రావు, డీఈవో

### గతేడాది సిరిసిల్లకు మూడోస్థానం

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పదోతరగతి ఫలితాల్లో జిల్లా ఏటా మెరుగైన ఫలితాలు సాధిస్తోంది. గత మూడేళ్లలో ఏడో స్థానం నుంచి మూడో స్థానానికి ఎగబాకింది. గతేడాది 98.27 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రస్తుతం మొదటి స్థానం సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. దసరా సెలవులకు ముందు సగం సిలబస్ పూర్తి చేశామని, డిసెంబర్‌లోగా శతశాతం చేరుకుంటామని అంటున్నారు. కానీ, ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కారణంగా కొన్ని పాఠశాలల్లో 40 శాతమే పూర్తయినట్లు పలువురు సీనియర్ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. సమ్మేటివ్ అసెస్మెంట్–1 ముగిసేనాటికి సగం సిలబస్ అవుతుందంటున్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 114, గురుకుల రెసిడెన్షియల్ 20, ఆదర్శ 07, కేజీబీవీలు 13, ప్రైవేటు 68 మొత్తం 222 పాఠశాలలున్నాయి.6,890 మంది పదోతరగతి చదువుతున్నారు.

**అల్పాహారానికి నిధులు ఎలాగో?**

ఏటా పదోతరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల సమయంలో గోరుముద్ద పేరిట అల్పాహారం అందిస్తున్నారు. దీనికి విద్యాశాఖ నిధులు కేటాయిస్తున్నా ఆయా పాఠశాలల పరిధిలోని దాతలు, ఎన్నారైలు, ప్రజాప్రతినిధులు విద్యార్థుల శ్రేయస్సు కోసం అల్పాహారానికి తమవంతు సాయం చేసేవారు. అయితే, ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తే రాజకీయం అవుతుందన్న చర్చ గతంలో జరిగింది. ఈ నేపథ్యంలో ఈసారి అల్పాహారం కోసం నిధులు ఎలా సమకూరుస్తారో వేచిచూడాలి.



సిరిసిల్ల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు (ఫైల్)

### ప్రథమ స్థానమే ధ్యేయం



పదోతరగతి ఫలితాల్లో గతేడాది జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఈ విద్యాసంవత్సరం ప్రథమ స్థానమే ధ్యేయంగా మరింత మెరుగైన విద్యాబోధన చేపడుతున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహించి, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటాం. లక్ష్యసాధనలో ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని హెచ్ఎంలకు, టీచర్లకు సూచించాం. – రమేశ్, డీఈవో

## న్యూస్‌రీల్

### ఓటరు జాబితా పరిశీలన



ఓటరు జాబితా పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

కమాన్‌పూర్(మంథని): వివిధ గ్రామాల్లో చేపట్టిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియను కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. డీఎల్‌పీవో సతీశ్‌కుమార్, ఎంపీడీవో లలిత, ఎంపీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

### ఆకట్టుకున్న ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లక్ష్యం నిర్దేశించుకుని చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి, లెక్చరర్లు శ్రీధర్, మాధవీలత, అరుణ, మమత, దేవేందర్, ప్రభాకర్, గణేశ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మంథని ఇన్‌చార్జి కమిషనర్‌గా మనోహర్



మంథని: మంథని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా బల్దియా కార్యాలయ సూపరింటెండెంట్ మనోహర్‌ను నియమించారు. ఈమేరకు కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. మొన్నటివరకు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన గుట్టల మల్లికార్జునస్వామిని హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయానికి సరెండర్ చేశారు. ఆయన స్థానంలో మనోహర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.


### గోదావరి తీరం శుభ్రం



పారిశుద్ధ్య పనుల్లో విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లు

కోల్‌సిటీ(రామగుండం): స్వచ్ఛతా హీ సేవా –2024లో భాగంగా రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరి పుష్కర ఘాట్ వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కేడెట్లు స్వచ్ఛందంగా పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్నారు. గోదావరి నదీ తీరాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా, నగరపాలక సంస్థ కార్యదర్శి రాజు, హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### పన్ను వసూళ్లపై శ్రద్ధ చూపండి



మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య

పెద్దపల్లిరూరల్: పంచాయతీల్లో ఆస్తిపన్ను, నల్లాబిల్లుల వసూళ్లపై శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ అధికారులు, స్వచ్ఛభారత్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది, కార్యదర్శులచ్చాయన సమావేశమయ్యారు. పన్ను వసూళ్లతోపాటు స్వచ్ఛతాహీ సేవలో భాగంగా పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై సర్వే చేపట్టాలని సూచించారు. డీఎల్‌పీవో వేణుగోపాల్, ఎంపీడీవో శ్రీధర్, ఎంపీవో ఫయాజ్, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్ రాఘవులు ఉన్నారు.

## లాభదాయక పంటలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: లాభదాయక పంటలను సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష వ్యవసాయాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో లాభదాయక పంటల సాగుపై మంగళవారం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయిల్ పాం సాగుపై అన్నదాతలకు అవగాహన కల్పించాలన్నారు. సాగుకు సర్కార్ అందిస్తున్న రాయితీ వివరాల గురించి వివరించాలని చెప్పారు. మూడేళ్ల తర్వాత వచ్చే ఆదాయం తదితర విషయాలను వివరించాలన్నారు. వచ్చే యాసంగిలో జిల్లావ్యాప్తంగా 1,500 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతీక్లస్టర్ పరిధిలో కనీసం 30 ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యేలా రైతులను చైతన్యపర్చాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**స్థానిక ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలి**

త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. ఇందుకోసం పంచాయతీల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేయాలన్నారు. తుది ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీల్లోని సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తేవాలని అన్నారు. ఎంపీవోలు పర్యవేక్షిస్తూ ఆస్తి పన్ను, నల్లాబిల్లులు వసూలు చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వచ్ఛదనం, పచ్చదనంపై ప్రజల్లో అవగాహన పెంచాలని పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీఆర్డీవో రవీందర్, డీపీవో వీరబుచ్చయ్య తదితరులు ఉన్నారు.

**ఎర్లీ లర్నర్ అసైన్‌మెంట్‌పై గూగుల్ మీట్..**

ఎర్లీ లర్నర్ అసైన్‌మెంట్ టూల్‌పై కలెక్టర్ కోయ శ్రీహర్ష గూగుల్‌మీట్ ద్వారా అజీత్ ప్రేంజీ ఫౌండేషన్ ప్రతినిధులతో ప్రీ స్కూల్ యాక్టివిటీ ప్లానింగ్, ఇంప్లిమెంటేషన్‌పై సమావేశం నిర్వహించారు. ఫౌండేషన్ ప్రతినిధులు టూల్ ఈజీగా పిల్లలు నేర్చుకునేలా రూపొందించినట్లు వివరించారు. డిడబ్ల్యూవో రవుఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం



పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్/ఎలిగేడు: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్ కూర మల్లారెడ్డితోపాటు డైరెక్టర్లు మంగళవారం శివపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావును ఆయన నివాసంలో కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనూ కలిశారు. డైరెక్టర్లు ఆల్ల సుమన్‌రెడ్డి, కొమ్ము కరుణాకర్, సోమ చంద్రయ్య, మడగోని శ్రీనివాస్, కలిపాక కనుకయ్య, వేగోలపు పెద్ద రాజేశం, పిట్టల కొమురయ్య, ఎండీ గౌస్ మియా, గోపతి సదానందం, కొల్లూరి రామచంద్రం, తిప్పారపు ప్రభాకర్, సరోత్తంరెడ్డి, ఎడ్ల మహేందర్ పాల్గొన్నారు.

### ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



లక్ష్మీనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: నాయకులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకోవాలన్నారు. పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చూడాలని ఆయన అన్నారు. 800మెగావాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని తెలిపారు. మేడిపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు స్థానంలో జలవిద్యుత్ కేంద్రం ఏర్పాటు కోసం సన్నాహాలు చేస్తున్నారని ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మీనగర్‌లో పర్యటించారు. వ్యాపారులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లక్ష్మీనగర్ సుందరీకరణకు వ్యాపారులు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మహంకాళి స్వామి, మారెల్లి రాజిరెడ్డి, పెద్దెల్లి ప్రకాశ్, తిప్పారపు శ్రీనివాస్, కొక్కిరాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### ఎంఈవోల నియామకం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పలు మండలాలకు మండల విద్యాధికారులు(ఎఫ్ఏసీ)గా సీనియర్ హెడ్మాస్టర్లకు ఎంఈవోలుగా అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కేంద్రమైన పెద్దపల్లి ఎంఈవోగా సురేందర్‌కుమార్‌ను నియమించింది. ఓదెలకు రమేశ్, ధర్మారం మండలానికి ఛాయాదేవి, ఎలిగేడుకు నరేంద్రాచారి, మంథనికి లక్ష్మి, సుల్తానాబాద్‌కు రాజయ్య, జూలపల్లికి సరస్వతి, ముత్తారం మండలానికి ఓదెలు, అంతర్గాం మండలానికి ఏకాంబర్, కమాన్‌పూర్ మండలానికి విజయ్‌కుమార్, పాలకుర్తికి విమల, రామగుండానికి చంద్రయ్య, రామగిరికి కొమురయ్య, కాల్వశ్రీరాంపూర్ మండలానికి మహేశ్‌ను నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

## పిటిషన్ మేనేజ్‌మెంట్‌లో ప్రతిభ



రిసెప్షన్ ఆఫీసర్ వెంకటలక్ష్మిని సన్మానిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి, పోలీసు అధికారులు

- గోదావరిఖని వన్‌టౌన్ ఠాణాకు నాలుగోస్థానం
- ఐదోస్థానంలో నిలిచిన ధర్మారం పోలీసుస్టేషన్

గోదావరిఖని/ధర్మారం(ధర్మపురి): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పిటిషన్ మేనేజ్‌మెంట్‌లో గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ నాలుగోస్థానం సాధించింది. ఈమేరకు రిసెప్షన్ ఆఫీసర్ వెంకటలక్ష్మి ఈ గౌరవం దక్కింది. ఠాణాకు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యలు తెలుసుకోవడం, చట్ట పరిధిలో పరిష్కరిస్తారనే నమ్మకం, భరోసా కల్పించడంలో ఆమె ముందు వరుసలో నిలిచారు. ఇలా ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్రంలో ఐదుగురిని ఎంపిక చేయగా, అందులో వెంకటలక్ష్మి నాలుగోస్థానంలో నిలిచారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆమెకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. అలాగే రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ దేవయ్య బెస్ట్ సిటిజన్ సర్వీస్‌లో మూడో స్థానం, పెద్దపల్లి జిల్లా ధర్మారం ఎస్సై లక్ష్మణ్ బెస్ట్ సిటిజన్ సర్వీస్‌లో ఐదోస్థానం సాధించారు. అధికారుల నుంచి మన్ననలు పొందారు. రాష్ట్రవ్యాప్తంగా 10 స్థానాల్లో మూడు, ఐదోస్థానం సాధించి రాష్ట్రంలోనే ప్రత్యేకత సాధించారు. వీరిని రామగుండం సీపీ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.



దేవయ్య, ఎస్సై



లక్ష్మణ్, ఎస్సై

### 28న జాబ్ మేళా

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు హైదరాబాద్‌లోని స్టాఫింగ్ టైటాన్స్ కంపెనీలో ఉద్యోగాల కోసం ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. స్టాఫింగ్ టైటాన్స్ కంపెనీలో 50 శాతం టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు 89853 36947, 81212 62441 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

**ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో..**

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాల కోసం ఈనెల 26న స్థానిక స్వరూప గార్డెన్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ కోయశ్రీహర్ష తెలిపారు. ఇంటర్‌లో 50 శాతం మార్కులతో పాసైన వారు హాజరుకావాలని ఆయన కోరారు.

## క్లుప్తంగా

### బైక్ ఢీకొని మహిళ మృతి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శాంతినగర్ వద్ద రోడ్డు దాటుతున్న గరిగె స్వరూప (49) అనే మహిళను మంగళవారం బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించింది. బస్టాండ్ ప్రాంతంలోని హోటల్‌లో కూలిగా పనిచేసే స్వరూప ఎప్పటిలాగే పనికోసం బయల్దేరగా పూసాలకు చెందిన వసంత్‌కుమార్ బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. మృతురాలి కుమారుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### గుండెపోటుతో వృద్ధుడు..

గంభీరావుపేట: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లెకి చెందిన వట్టిమల్ల ఎల్లయ్య (78) మంగళవారం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి బస్టాండ్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. ఎల్లయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కరీంనగర్‌లోని ఆస్పత్రికి వెళ్తుండగా బస్సులోనే గుండెపోటు వచ్చింది. దీంతో వృద్ధుడిని కిందకు దించుతుండగానే మృతిచెందాడు. 108 సిబ్బంది మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

### ఆన్‌లైన్ పెట్టుబడితో మోసపోయిన మహిళ

జగిత్యాల క్రైం: ఓ మహిళ ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టి, మోసపోయింది. ఎస్సై వేణుగోపాల్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన మహిళ ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ వస్తుందని స్నేహితుల ద్వారా తెలుసుకుంది. డై అనే యాప్‌కు సంబంధించిన లింక్ ఓపెన్ చేసి, రిజిస్ట్రేషన్ చేసుకుంది. తర్వాత అందులో మూడుసార్లు మొత్తం రూ.1.78 లక్షల పెట్టుబడి పెట్టింది. సోమవారం యాప్ ఓపెన్ కాలేదు. దీంతో తాను మోసపోయినట్లు నిర్ధారించుకొని, మంగళవారం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

- పెళ్లయిన ఏడు నెలలకే బలవన్మరణం


శ్రావణి(ఫైల్)

కరీంనగర్‌క్రైం: అదనపు కట్నం తీసుకురావాలనే అత్తింటివారి వేధింపులు భరించలేక ఒక వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కట్టరాంపూర్‌లో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ కోటేశ్వర్ కథనం ప్రకారం.. కరీంనగర్ కట్టరాంపూర్ ప్రాంతానికి చెందిన దొంత అజయ్‌కుమార్‌కు సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం ఎల్లంపల్లికి చెందిన శ్రావణి(22)తో ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం జరిగింది. వివాహ సమయంలోనే పుట్టింటివారు కట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. అయితే, కొద్దిరోజులుగా శ్రావణి భర్త అజయ్‌కుమార్, అత్త ఉపేంద్ర, మామ అంజయ్య కలిసి అదనపు కట్నం కావలని ఆమెను వేధిస్తున్నారు. ఆ వేధింపులు భరించలేక మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు తండ్రి సంగెం కొము రయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా, వివాహమైన సుమారు ఏడు నెలలకే చనిపోవడంతో ఆగ్రహించిన కుటుంబసభ్యులు, బంధువు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు తరలివచ్చారు. వారిరాకతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న ఏసీపీ నరేందర్, సీఐ కోటేశ్వర్ తమ సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.

# మూడు నెలల శ్రమ వృథా!

- అనుభవ, బాధ్యతా రాహిత్యమా?
- సీనియర్లు లేకపోవడమా?
- పతకాలు లేకుండానే సింగరేణి
- కొలంబియా పోటీల్లో తీవ్ర నిరాశ
- రెస్క్యూ టీం ఇంటిదారి
- అధికారుల్లో మొదలైన అంతర్మథనం


ఇటీవల కొలంబియా పోటీల్లో తలపడుతున్న బిగ్రేడియర్లు

- 18ఏళ్లుగా రెండేళ్లకోసారి జరిగే అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో పాల్గొంటున్న సింగరేణి జట్టు ఈసారి ఉత్త చేతుల్తోనే వెనుతిరిగింది.
- నాలుగేళ్ల క్రితం బరిలో దిగిన కోలిండియా జట్టు ఓవరాల్ రెండో చాంపియన్‌గా నిలిచింది.
- తొలిసా హాజరైన హిందూస్తాన్ జింక్(హెచ్‌జెడ్‌ఎల్) మహిళా జట్టు బహుమతి సాధించింది.

గోదావరిఖని(రామగుండం): అనుభవ రాహిత్యమా.. ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ లేకపోవడమా, ముందుచూపు కొరవడటమా.. ఇలా కారణం ఏదైనా అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో సింగరేణి జట్టు చతికిలపడింది. ఈ పోటీల కోసం మూడునెలల పాటు చేసిన కసరత్తు వృథాగా పోయింది. రెస్క్యూ బ్రిగేడియర్లు 45రోజుల పాటు చేసిన శ్రమంతా వృథాగా అయ్యింది. మనదేశం నుంచి మూడుజట్లు హాజరయ్యాయి. ఇందులో కోలిండియాకు చెందిన వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్ ఓవరాల్ రెండోస్థానం సాధించింది. హిందూస్తాన్ జింక్ మహిళా జట్టు కూడా రెండో స్థానం సాధించి అంతర్జాతీయ పోటీల్లో మువ్వన్నెల జెండా ఎగురవేసింది. 13వ అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలు(ఐఎంఆర్‌సీ) కొలంబియా దేశంలో ఈనెల 15 నుంచి ఈనెల 20వ తేదీ వరకు జరిగాయి. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే ఐఎంఆర్‌సీ పోటీల్లో సింగరేణి రెండు దశాబ్దాలుగా హాజరవుతూ వస్తోంది. ఆలిండియా పోటీల్లో డబుల్ హ్యాట్రిక్ సాధించినా.. అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చూపకలేకపోయింది.

**పెద్దదేశాలు లేకున్నా పట్టు సాధించలే..**

కొలంబియాలో అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలకు పెద్దదేశాలు దూరంగా ఉన్నాయి. వాస్తవానికి 22దేశాలు పాల్గొనాల్సి ఉన్నా.. చిన్నదేశం కావడంతో అమెరికా, సౌత్‌ఆఫ్రికా, రష్యా, ఆస్ట్రేలియా జట్లు పోటీలకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో విశేష అనుభవం ఉన్న సింగరేణి జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలుస్తుందని భావించారు. కానీ నిరాశే మిగిలింది.

**అధికారుల్లో అంతర్మథనం**

కొలంబియాలో జరిగిన అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో సింగరేణి జట్టు చలికిలబడడంపై అధికారులు అంతర్మథనంలో పడిపోయినట్లు సమాచారం. అంతర్జాతీయ పోటీల్లో విశేష అనుభవం ఉన్న అధికారులతోపాటు టీం సభ్యులకు ఈసారి చోటివ్వకపోవడం కూడా ఓటమికి కారణమని భావిస్తున్నారు. ప్రధానంగా జట్టులో 60శాతం సభ్యులు అనువజ్ఞులు ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదంటున్నారు. అంతేకాకుండా సమన్వయం కోసం మరో ఇద్దరు లేదా ముగ్గురు అధికారులు వెళ్తే బాగుండేది అంటున్నారు. ఆరేళ్ల క్రితం నుంచి అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో పాల్గొంటున్న వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్(డబ్ల్యూసీఎల్) జట్టు ఓవరాల్ రెండోస్థానం సాధించి జాతీయ జెండాను అంతర్జాతీయ స్థాయిలో ఎగురవేసి దేశగౌరవాన్ని నిలబెట్టింది.

**కొలంబియా పోటీల్లో పతకాలు సాధించిన దేశాలు**

| | |
|---|---|
| పాల్గొన్న జట్లు(పురుషులు) | 18 |
| బహుమతి | దేశం |
| ఓవరాల్ ఫస్ట్ | కెనడా |
| ఓవరాల్ సెకండ్ | కోలిండియా |
| ఓవరాల్ థర్డ్ | కొలండియా |
| మహిళా విభాగం | 3 |
| ఓవరాల్ ఫస్ట్ | కొలంబియా |
| ఓవరాల్ సెకండ్ | హిందూస్తాన్ జింక్ |
| ఓవరాల్ థర్డ్ | కెనడా |
| ఫస్ట్ ఎయిడ్ | |
| ప్రథమ | కొలంబియా |
| ద్వితీయ | కోలిండియా |
| తృతీయ | కెనడా |
| ఎక్విప్‌మెంట్ మెకానిక్ | |
| ప్రథమ | చైనా |
| ద్వితీయ | కొలండియా |
| తృతీయ | కొలంబియా |

**అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో సింగరేణి**

| ఎప్పుడు | ఏడాది | దేశం | బహుమతి |
|---|---|---|---|
| పదోసారి | 2006 | చైనా | ఫస్ట్‌ఎయిడ్‌లో ఓవరాల్‌లో 2, మైన్స్‌లో ఐదోస్థానం |
| ఆరోసారి | 2008 | అమెరికా | గౌరవ గుర్తింపు |
| ఏడోసారి | 2010 | ఆస్ట్రేలియా | ఫస్ట్‌ఎయిడ్‌లో ఓవరాల్ బెస్ట్ |
| ఎనిమిదోసారి | 2012 | ఉక్రెయిన్ | ఇంజినీరింగ్ అనాలసిస్‌లో ఆరోస్థానం, రెస్క్యూ ఈవెం ట్స్‌లో తొమ్మిదో స్థానం |
| తొమ్మిదోసారి | 2014 | పోలండ్ | హాజరుకాలేదు |
| పదోసారి | 2016 | కెనడా | గౌరవ గుర్తింపు |
| పదకొండోసారి | 2018 | రష్యా | హాజరు కాలేదు |
| పన్నెండోసారి | 2020 | కోవిడ్‌తో పోటీలు లేవు | |
| పదమూడోసారి | 2022 | అమెరికా | గౌరవ గుర్తింపు |
| పద్నాలుగోసారి | 2024 | కొలంబియా | పతకాలు లేవు |



### రాజన్న హుండీ ఆదాయం రూ. 1.44 కోట్లు


డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయ 12 రోజుల హుండీని మంగళవారం లెక్కించారు. రూ.1,44,06,154ల ఆదాయం, 710 గ్రాముల బంగారం, 14 కిలోల వెండి సమకురినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

### ఉపాధి లేదని బెంగతో నేత కార్మికుడికి గుండెపోటు

- పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబం
- అంత్యక్రియలకు కూడా డబ్బులు లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


సూర్యనారాయణ (ఫైల్)

సిరిసిల్లఅర్బన్: ఉపాధి లేదనే బెంగతో నేత కార్మికుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన రాజన్న సిరిసిల్ల కేంద్రంలోని చంద్రంపేటలో జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు.. చంద్రంపేటకు చెందిన కొండ బత్తిని సూర్యనారాయణ (55) సాంచాలు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో రూ.5 లక్షల అప్పు చేసి రేకుల షెడ్డు నిర్మించాడు. ఈ మధ్యకాలంలో సాంచాల పని బందుకావడంతో ఉపాధి లేకుండాపోయింది. దీంతో అప్పు ఎలా తీర్చాలని దిగులుపడుతూ ఉండేవాడు. సోమవారం రాత్రి ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. అంత్యక్రియలకు కూడా డబ్బులు లేకపోవడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. మృతుడికి భార్య విజయ, కుమారుడు శివసాయికుమార్, కూతురు ప్రియాంక ఉన్నారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

# హోరాహోరీగా ఎస్జీఎఫ్ పోటీలు


వాలీబాల్ విజేత జట్టుతో పీఈటీలు ప్రణయ్, ఆసీయా, సంధ్య తదితరులు

- ప్రతిభ చూపిన క్రీడాకారులు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో సురేశ్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రేగడిమద్దికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జోనల్‌స్థాయి ఎస్జీఎఫ్ క్రీడాపోటీలు హోరాహోరీగా జరిగాయి. సుల్తానాబాద్, ఓదెల, ఎలిగేడు, జూలపల్లి మండలాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. డీవైఎస్‌వో సురేశ్ పోటీలను ప్రారంభించారు. అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించగా, 16 జట్లు హాజరయ్యాయి. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దివ్యదర్శన్, ఎంఈవోలు సురేందర్, రాజయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్, హెచ్ఎం రాధాస్వామి, జోనల్ కన్వీనర్ దాసరి రమేశ్, పీఈటీలు ప్రణయ్, ఆసీయా, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

**విజేతల వివరాలు**

వాలీబాల్(బాలురు) అండర్–14 : ప్రథమ సుల్తానాబాద్, ద్వితీయ, ఓదెల. అండర్–17 : ప్రథమ సుల్తానాబాద్, ద్వితీయ ఓదెల).
వాలీబాల్(బాలికలు) అండర్–14 : ప్రథమ సుల్తానాబాద్.
అండర్–17 : ప్రథమ ఓదెల, ద్వితీయ సుల్తానాబాద్).
కబడ్డీ(బాలురు) అండర్–1 : ప్రథమ ఓదెల, ద్వితీయ సుల్తానాబాద్.
అండర్–17 : ప్రథమ సుల్తానాబాద్, ద్వితీయ ఓదెల.
బాలికలు : అండర్–14 : ప్రథమ ఎలిగేడు, ద్వితీయ సుల్తానాబాద్.
అండర్–17 : ప్రథమ ఎలిగేడు, ద్వితీయ ఓదెల.

# జాబ్ చేయాలంటూ తల్లి మందలించిందని..

- ఈ నెల 8న కొడుకు ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి
- తల్లిపై దాడికి యత్నించిన స్థానికులు
- అడ్డుకొని, బాధితురాలిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- జగ్గాసాగర్‌లో ఘటన


ప్రభాస్ (ఫైల్)


మృతుడి తల్లికి రక్షణగా ఉన్న పోలీసులు

మెట్‌పల్లిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు 16 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనికి అతని తల్లి మందలించడమే కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసుల ఎదుటే ఆమెపై దాడికి యత్నించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలంలోని జగ్గాసాగర్‌కు చెందిన ఏనుగు ప్రభాస్(19) హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తున్నాడు. ఈ నెల 8న ఇంటివద్దే క్రిమిసంహార మందు తాగాడు. కుటుంబసభ్యులు పలు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. ఆ తర్వాత నిజామాబాద్‌లోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందాడు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకెళ్లారు. కాగా, జాబ్ చేయాలంటూ తల్లి మందలించడంతో ప్రభాస్ మనస్తాపానికి గురై, ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి ప్రతాప్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

**తల్లిపై దాడికి యత్నించిన గ్రామస్తులు**

ప్రభాస్ మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారని తెలుసుకున్న గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అతని మృతికి తల్లే కారణమంటూ ఆగ్రహంతో ఆమెపై దాడికి యత్నించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న పోలీసులు వద్దని చెప్పినా వారు వినిపించుకోలేదు. పరిస్థితి చేయిదాటిపోవడంతో ఆమెను ఇంట్లో ఉంచి, రక్షణ కల్పించారు. ఒక దశలో స్థానికులు ఆ ఇంటిపైకి రాళ్లు విసరడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. ఇంట్లోకి చొచ్చుకెళ్లి, దాడికి చేసేందుకు ప్రయత్నించడంతో మెట్‌పల్లి ఎస్సై–1 చిరంజీవి, ఎస్సై–2 రాజు, సిబ్బంది ఆమెను చాకచక్యంగా తమ వాహనంలో కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ గ్రామానికి చేరుకొని, పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

**నిలిచిన అంత్యక్రియలు**

ప్రభాస్ మృతదేహానికి అంత్యక్రియలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉంటున్న ఇల్లు, 4 ఎకరాల భూమి మృతుడి తల్లి పేరిట ఉన్నాయి. వాటిని బుధవారం అతని తండ్రి ప్రతాప్‌కు బదలాయించాకే అంత్యక్రియలు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.

**రెండు రకాల ఫిర్యాదులు**

ప్రభాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతని తండ్రి ప్రతాప్ గల్ఫ్ నుంచి వచ్చాడు. మొదట పాయిజన్ ఇచ్చి, హత్యాయత్నం చేశారని భార్యతోపాటు మరొకరిపై ఫిర్యాదు చేశాడు. వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. మంగళవారం మాత్రం జాబ్ చేయమని తల్లి మందలించిందని, ఆ కారణంగానే పాయిజన్ తీసుకున్నాడని మరో ఫిర్యాదు చేశాడు. ఇలా భిన్నమైన కారణాలు చూపుతూ రెండు ఫిర్యాదులు చేయడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

# మరణించి.. జీవించి

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి
- మృతుడి నేత్రాలు దానం చేసిన కుటుంబసభ్యులు


నర్సయ్య (ఫైల్)

తిమ్మాపూర్(మానకొండూర్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు.. ఆయన నేత్రాలను దానం చేయడంతో మరణించినా జీవించే ఉన్నట్లయిందని మృతుడి బంధువులు తెలిపారు. ఎల్ఎండీ ఎస్సై వివేక్ కథనం ప్రకారం.. తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్‌కు చెందిన మాడిశెట్టి నర్సయ్య(55)కు భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. అతను అలుగునూర్ చౌరస్తాలో తన కుమారుడు రాజేశ్‌తో కలిసి కార్ వాషింగ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి షాప్ మూసివేసి, బైక్‌పై నుస్తులాపూర్ వెళ్తున్నాడు. వెనకాలే మరో బైక్‌పై రాజేశ్ వస్తున్నాడు. మహాత్మానగర్‌లోని ఓ పాఠశాల వద్దకు రాగానే వెనక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సయ్య తీవ్రంగా గాయపడ్డాడు. వెనకాలే వస్తున్న అతని కుమారుడు గమనించి, స్థానికులతో కలిసి ఆటోలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ నర్సయ్య మంగళవారం వేకువజామున మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ సర్పంచ్‌లు రావుల రమేశ్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు పోలీసులను కోరారు.

**మృతుడి నేత్రాలు దానం..**

నర్సయ్య నేత్రాలను దానం చేసేందుకు అతని కుమారుడు రాజేశ్ ముందుకు వచ్చాడు. శాతవాహన లయన్స్ క్లబ్, కాళేశ్వరి లయన్స్ బాధ్యులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, లయన్ కంది జ్యోతికి సమాచారం అందించాడు. వారు మంగళవారం గ్రామానికి చేరుకొని, నర్సయ్య నేత్రాలు సేకరించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఎల్‌వీ.ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యులను వారు అభినందించారు. సతీశ్, నర్సింహారెడ్డి, కోల అన్నారెడ్డి, కొండ రాధిక, కోల లావణ్య, రామ్మోహన్‌రావు, సురేందర్, వందన, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి, పట్టభద్రులకు వారధిగా నిలుస్తా

- ట్రస్మా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు


మాట్లాడుతున్న యాదగిరి శేఖర్‌రావు

కరీంనగర్: రానున్న శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తానని, ప్రభుత్వానికి, పట్టభద్రులకు వారధిగా నిలుస్తానని ట్రస్మా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. మంగళవారం పద్మనాయక కల్యాణ మండపంలో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయుల సన్మాన సమ్మేళనాన్ని నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యావ్యవస్థ, నిరుద్యోగుల పక్షాన గళం వినిపించేందుకు శాసన సమండలికి పంపితే రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానన్నారు. ఆలిండియా ప్రిన్సిపల్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ ఫౌండర్ అండ్ సెక్రెటరీ డాక్టర్ ఏ జోత్స్నరావు మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు ట్రస్మా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి, సిరిసిల్ల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముసుకు తిరుపతిరెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సిద్దయ్య, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు, మాజీ అధ్యక్షుడు సుభాష్మా, 13 జిల్లాల అధ్యక్ష ,కార్యదర్శులు కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల కరస్పాండెంట్లు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అటవీశాఖ అధికారుల తీరుపై నిరసన

- ఇప్పపెల్లి గ్రామస్తుల ఆందోళన
- మెట్‌పల్లి డీఎస్పీ హామీతో విరమణ



కథలాపూర్(వేములవాడ): అటవీశాఖ అధికారుల తీరును నిరసిస్తూ కథలాపూర్ మండలంలోని ఇప్పపెల్లివాసులు మంగళవారం గ్రామ కూడలిలో ఆందోళన చేపట్టారు. గ్రామ శివారు అటవీ భూముల్లోని చెట్లను మూడేళ్లుగా ఇతర గ్రామస్తులు తొలగించి, చదును చేస్తుంటే సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కానీ, గ్రామ అవసరాల కోసం ఇటీవల అందరం కలిసి, భూమిని చదును చేస్తే కొందరిపై కేసు పెట్టారంటూ మండిపడ్డారు. ఇతర గ్రామస్తులపై ఎందుకు చర్యలు తీసుకోలేదో అటవీశాఖ అధికారులు గ్రామానికి వచ్చి, సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోరుట్ల, మేడిపెల్లి ఎస్సైలు శ్రీకాంత్, శ్యాంరాజ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇళ్లలోకి వెళ్లాలని సూచించినా గ్రామస్తులు పట్టించుకోలేదు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నీరంజన్ రెడ్డి గ్రామానికి చేరుకొని, ఆందోళనకారులతో మాట్లాడారు. అటవీశాఖ అధికారులు, గ్రామ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



